## క్లుప్తంగా

### యమపాశాల్లా కరెంటు తీగలు



పొలాల్లో వేలాడుతున్న కరెంటు తీగలను చూపుతున్న రైతులు

మిరుదొడ్డి(దుబ్బాక): పంట పొలాల్లో వేలాడుతున్న కరెంటు తీగలు యమపాశాల్లా ఉన్నాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని కొత్త కుంట ప్రాంతంలో చేతికి అందే ఎత్తులో ఉన్న కరెంటు తీగలతో వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అందె ఫీడర్ చానల్ నుంచి వచ్చే కరెంటు తీగలు మరింత ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. పొలాల్లో వేలాడుతున్న కరెంటు తీగల కారణంగా ప్రస్తుతం ట్రాక్టర్లతో దున్నలేని పరిస్థితులు నెలకొన్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వేలాడుతున్న కరెంటు తీగలు తాకడంతో రైతు సుమన్ మృత్యువాత పడ్డాడని తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని మండిపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పొలాల్లో వేలాడుతున్న కరెంటు తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

### 10న మండల సమావేశం

మిరుదొడ్డి(దుబ్బాక): ఈనెల 10వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగుల గణేష్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు జరిగే మండల సమావేశానికి గౌరవ ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల పాలనాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆలయ ఈవో బాలాజీ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లోని అన్నదాన సత్రం వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆలయ ఈవో బాలాజీ దాతలతో కలసి గురువారం ప్రారంభించారు. వరంగల్‌కు చెందిన భక్తులు యస్పాల్, సోనియా రూ.4 లక్షల విలువైన వాటర్ ప్లాంట్ సామగ్రిని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరు అందించాలని వాటర్ ప్లాంట్ సామగ్రిని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

### ఆలయ కమిటీ చైర్మన్‌గా రామచంద్రారెడ్డి



తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురం శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పులగుర్ల రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పులగుర్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోదనం కనకయ్య, కార్యదర్శిగా మరుపల్లి మల్లేశంగౌడ్, కార్యవర్గ సభ్యులుగా కుంబాల రామస్వామి, కొమ్ము శరత్, అక్కం స్వామి, గంగసాని రాజిరెడ్డి, పులగుర్ల రాజిరెడ్డి, మరుపల్లి పరుశురాములు గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతల ద్వారా నిధులు సేకరిస్తామన్నారు. ఏటా నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నూతన కమిటీ కృషిచేస్తుందన్నారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

### యోగా తరగతులు తప్పనిసరి

సిద్దిపేటజోన్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రోజూ అరగంట విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించేలా ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేస్తే ఆరోగ్య సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అంతర్జాతీయ యోగా శిక్షకుడు బండి రాములు అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 37 ఏళ్లుగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని వివరించారు. చైనా, యూకే, స్కాట్లాండ్, డెన్మార్క్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో తనకు శిష్యులు ఉన్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు కోరితే స్వచ్ఛందంగా యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం పలు ఆసనాలు వేశారు.

# బిల్లులు మంజూరుకాక



గుంతలు పడిన ఎర్రగుంటపల్లి మట్టి రోడ్డు

- ప్రభుత్వ నిధులు రాక ఎంపీటీసీల ఆవేదన
- చేసిన పనులకు ఏళ్లు గడుస్తున్నా రాని బిల్లులు
- మరో నెలతో ముగియనున్న పదవీకాలం
- ఎన్నికల్లో గెలిచి ఓడామని ఆవేదన

ఖద్దరు బట్టలు వేశాం.. కానీ జేబులో చిల్లిగవ్వ లేదు.. ఎన్నికల మీటింగ్‌లంటే అప్పుచేసి వేలకు వేలు ఖర్చు చేశాం. ఇక పార్టీ కోసం పైసా ఖర్చు పెట్టే పరిస్థితి లేదు. గ్రామానికి ఎవరైన వస్తున్నారంటే ముఖం చాటేస్తున్నాం. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరుకాక నానా అవస్థలు పడుతున్నాం. ఓ గ్రామానికి చెందిన ఎంపీటీసీ తన బాధను వెళ్లగక్కాడు. ఈ ఒక్క ఎంపీటీసీ మాత్రమే కాదు రూ.లక్షలు ఖర్చు పెట్టి గెలిచిన ప్రతీ ప్రజాప్రతినిధి బాధ ఇది. – కోహెడరూరల్(హుస్నాబాద్)

**27 గ్రామాలకు 13 మంది ఎంపీటీసీలు**

మండలంలో 27 గ్రామ పంచాయతీలకుగాను 13 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీటీసీలుగా గెలిచి నాలుగేళ్లు దాటుతున్నా సరిపడా నిధులు రాకపోవడంతో పనులు చేయించే పరిస్థితి లేదు. ఖర్చులు భరించే స్తోమత లేక చాలా మంది ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో వారంతా నిరాశలో ఉన్నారు.

అభివృద్ధి పనుల కోసం అప్పులు చేశామని, అవి ఎలా తీర్చాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని తమలో తాము రోదిస్తున్నారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని వాపోతున్నారు. తాము ఉండే వీధిలో రోడ్డుపై గుంతలు పడితే తట్టెడు మట్టి పోయలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు.

**రూ..లక్షల్లో ఖర్చు**

ఎన్నికలకు ముందు పార్టీ టిక్కెట్ దక్కించుకోవడం కోసం ప్రారంభమై ఖర్చు గెలిచిన తర్వాత ఆ మొత్తం రాలేదని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులకు నిధులు వచ్చినా ఎంపీటీసీలకు సరిపడా నిధులు విడుదల కాలేదని, దీంతో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఎన్నికల్లో గెలిచి ఓడిపోయమని అంటున్నారు.

**నిధులు మంజూరు చేయాలి**

ప్రజలకు మంచి చేద్దామని ప్రజాప్రతినిధిగా వచ్చా. పదవి చేపట్టి నాలుగేళ్లు దాటింది. తీరా చూస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక పోయాం. దీంతో మాపై ఆశలు పెట్టుకున్న ప్రజలకు ఏ పని చేయలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎంపీటీసీలకు నిధులు మంజూరు చేయాలి.

– ద్యాగటి సురేందర్, ఎంపీటీసీ, వింజపల్లి

**ఇప్పటికీ బిల్లులు రాలేదు**

కోహెడ మండల కేంద్రంలో రూ.4 లక్షలతో అభివృద్ధి పనులు చేశాం. 14 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. చేసిన పనులకు బిల్లుల చెక్కు ఇచ్చి మళ్లీ తీసుకున్నారు. అధికారుల చుట్టు తిరిగి తిరిగి అలసిపోయాం. అప్పులు తెచ్చి పనుల చేస్తే బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పటికైనా మమ్మల్ని ఆదుకోవాలి.

– ఖమ్మం స్వరూప, ఎంపీటీసీ, కోహెడ

# ఆలయ భూముల కబ్జాపై చర్యలకు డిమాండ్

సీపీఎం జిల్లా కార్యదర్శి మాల్లారెడ్డి



ఆలయ భూములను పరిశీలిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ భూములను కబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మాల్లారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్యతో కలసి అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ తన పదవిని అడ్డు పెట్టుకొని మల్లన్న ఆలయ భూములను ఆక్రమిస్తున్నాడని ఆరోపించారు. అతడిపై ఆలయ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏడేళ్ల క్రితమే రెవెన్యూ అధికారులు ఆలయ భూములు సర్వే చేసి ప్రహరీ నిర్మించారన్నారు. ఆలయ ఆధీనంలో ఉన్న వందల కోట్ల విలువైన భూములను చిరు వ్యాపారులకు కిరాయికి ఇస్తున్నా ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ తతంగమంతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి తెలిసే జరుగుతుందని ఆరోపించారు. సొంత పార్టీ కార్యకర్తలే కొమురవెల్లి మండల అధ్యక్షుడిపై ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఆలయ భూములను ఆక్రమిస్తున్నట్లు ఆలయ ఈవో బాలాజీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. కబ్జాలపై తగిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కుడికాల బాల మోహన్, తాడూరి రవీందర్, అత్తిని శారద, తాడూరి మల్లేశం పాల్గొన్నారు.

# జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి



వినతి పత్రం అందిస్తున్న కార్మికులు, నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికుల వేతనాల విషయమై మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు జీవో 60ప్రకారం వేతనాలు చెల్లిస్తుంటే రెండేళ్లుగా చేర్యాల మున్సిపాలిటీ కార్మికులకు కేవలం రూ.12 వేలు చెల్లించడం దారుణమన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులకు మద్దతుగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శోభ, వ్యవసాయ కార్మిక సంఘ పట్టణ కార్యదర్శి మల్లేశం, శీను, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన బోధన

ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్



కళాశాల విద్యబోధనపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న లెక్చరర్లు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ అన్నారు. టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ గురువారం మండల పరిధిలోని కాసులాబాద్‌లో లెక్చరర్లు కాలేజీ బాట కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థిని తీర్చిదిద్దడానికి ప్రశాంతమైన వాతావరణంలో అనుభవం కలిగిన లెక్చర్లతో విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. సామాజిక విలువలను తెలిపే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి శిబిరాలను కూడా కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు రామచంద్రయ్య, చన్నాదేవి, చంద్రయ్య, నరేందర్, కన్నయ్య, భాస్కర్, రఘువీర్, సంతోష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ చిహ్నం మార్పును స్వాగతిస్తున్నాం



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ రాష్ట్ర చిహ్నం మార్పును స్వాగతిస్తున్నట్లు ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు మహారాజ్ తెలిపారు. అయితే రాష్ట్రంలోని 90 శాతం మంది బీసీ, ఎస్టీ, ఎస్సీ ప్రజల వారసత్వ ప్రేరణను కొనసాగించడానికి ధర్మ సమాజ్ పార్టీ రూపొందించిన చిహ్నాన్ని ప్రభుత్వం ఆమోదించాలని కోరుతూ గురువారం మిరుదొడ్డి డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు పార్టీ రూపొందించిన చిహ్నాన్ని ఆమోదించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామన్నారు.

# ఆ భవనాన్ని ఎస్సీ బాలురకే కేటాయించాలి



వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని జనగామ జిల్లా నర్మెట్ట గురుకుల కళాశాలకు కేటాయించకుండా పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌కు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెరిపోతుల జనార్ధన్ కోరారు. ఈ మేరకు గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ అభివృద్ధి నిధులతో చేర్యాలలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని గత ప్రభుత్వం మిట్టపల్లి గురుకుల బాలికల డిగ్రీ కళాశాలకు కేటాయించిందన్నారు. దీంతో ఎస్సీ విద్యార్థులకు హాస్టల్ భవనం లేకుండా పోయిందని, ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వ ఉన్నతాధికారులకి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి ఎస్సీ విద్యార్థుల కోసం నిర్మించిన భవనాన్ని వారికే కేటాయించాలని కోరారు. కాదని జనగామ జిల్లాలోని నర్మెట్ట గురుకుల కళాశాలకి కేటాయిస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్, జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న, జిల్లా బాలికల కన్వీనర్ ఆకుల శిరీష, నాయకులు చట్ల సమ్మన్న, తుమ్మలపల్లి శిరీష తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 132 కేవీ/33కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేష్‌కుమార్ గురువారం తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులు, సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని అన్ని గ్రామాలు, నారాయణరావుపేట మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి, కోదండరావుపల్లి, బంజారుపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామలతో పాటుగా, సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల, కిష్టసాగర్, ఎన్సాన్‌పల్లి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, డీఎక్స్ఎన్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

**గజ్వేల్ పట్టణంలో..**

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డు లోగల 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఐదు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ(ఆపరేషన్) భానుప్రకాష్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గజ్వేల్, వర్గల్, ములుగు, మర్కూక్, రాయపోల్ మండలాల్లోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# యూనిఫాం అందజేత



పిడిచెడ్‌లో ఉపాధ్యాయులకు యూనిఫాం అందజేస్తున్న డీపీఎం వాసుదేవ్



అక్కన్నపేటలో యూనిఫాం అందజేస్తున్న ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: పాఠశాలల ప్రారంభానికి ముందే యూనిఫాం పంపిణీ చేస్తామని డీపీఎం వాసుదేవ్ అన్నారు. మండల పరిధిలోని పిడిచెడ్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు గురువారం 85 జతల యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో పాఠశాలలన్నింటికీ యూనిఫాం అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఎం నాగరాజు, సీసీ చంద్రకళ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణ, హెచ్‌ఎం భాస్కర్ పాల్గొన్నారు.

**ఎంఆర్‌సీ కార్యాలయంలో..**

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల ఎంఆర్‌సీ కార్యాలయంలో గురువారం ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ స్కూల్ యూనిఫాంను సీఆర్‌పీ లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 52 పాఠశాలకు గాను 2,132 యూనిఫాం అందజేశామన్నారు.

# బడీడు పిల్లలు బడిలోనే ..



మిరుదొడ్డి(దుబ్బాక): కూడవెల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యాశాఖ ఆదేశాల మేరకు మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడీడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్లు, కమిటీ సభ్యులు, గ్రామ స్వయం సహాయక మహిళా సభ్యులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈనెల 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాలల్లో మండల నోడల్ అధికారి ప్రవీణ్‌బాబు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు వెంకట రాజలింగం, పీవీ సత్య కుమార్, జాకిర్ హుస్సేన్, వెంకట నర్సింహులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆంజనేయులు, సోమ గారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గంగాపూర్‌లో..**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్ అంగన్‌వాడీ సిబ్బంది గురువారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంతోపాటు నాణ్యమైన విద్య అందిస్తామన్నారు. రెండేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు గల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఏలు పాల్గొన్నారు.

**ప్రతీ గ్రామంలో పండగలా..**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని ప్రతీ గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పండగలా నిర్వహించారు. ర్యాలీలు తీసి చదువు ప్రాముఖ్యతను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపిస్తూ నిరక్షరాస్యత నిర్మూలనకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**ఇంటింటికి తిరుగుతూ..**

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం బడిబాట ర్యాలీలు నిర్వహించారు. బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

**దుద్దెడలో ..**

కొండపాక(గజ్వేల్): బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాధికారి పి. శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో బడి బాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం అమ్మ ఆదర్శ కమిటీల నిర్వహణలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం కుకునూరుపల్లి హైస్కూల్లో బడిబాట ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ ఎంలు లక్ష్మీ, సత్తయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకిలో..**

బెజ్జంకి(సిద్దిపేట): బడీడు పిల్లందరినీ బడిలో చేర్పించాలని బెజ్జంకిలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ శంకరాచారికి ఘన సన్మానం**

బెజ్జంకి(సిద్దిపేట): విశ్వకర్మ లెజండరీ అవార్డు గ్రహీత నారోజు శంకరాచారిని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ఆయన చేస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు డాక్టర్ జానకిరాములు, రామచంద్రం, రాము, సంతోష్, కుబేర్ తదితరులు పాల్గొన్నారు

**◆ నేడు దౌల్తాబాద్ మండల సమావేశం**

దుబ్బాకటౌన్: దౌల్తాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంటక లక్ష్మమ్మ గురువారం తెలిపారు. సమావేశానికి ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధి కారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావా లని పేర్కొన్నారు.

**◆ నేడు కార్యవర్గ సమావేశం**

గజ్వేల్‌రూరల్: మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేసేందుకు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కేంద్రంలో జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించ తలపెట్టిన మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేసేందుకు సిద్దిపేట జిల్లా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు జరిగే సమావేశానికి ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

**◆ జూన్ 8న జాతీయ లోక్ అదాలత్**

గజ్వేల్‌రూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని గజ్వేల్ అదనపు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల సేవాధికార సంస్థ చైర్మన్ ప్రియాంక గురువారం సూచించారు. రాజీపడదగ్గ కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా పోలీసులు, సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. జూన్ 8న జరిగే లోక్ అదాలత్‌లో ఎక్కువ మందికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**◆ నేడు సర్వసభ్య సమావేశం**

కొండపాక(గజ్వేల్): కొండపాక ఐఓసీ కార్యాలయం లోగల ఎంపీపీ అత్యవసర సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేకాధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

**◆ మురుగు పారుదలతో ఇబ్బంది**



గజ్వేల్‌రూరల్: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి మురుగు పారుతుండటంతో తీవ్రదుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని సంగాపూర్ మార్గంలో గోదాం పక్కన ఓ వీధిలో కొన్ని రోజులుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి మురుగు పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**◆ ముగిసిన ఐసెట్ పరీక్ష**

సిద్దిపేటఅర్బన్: ఐసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పొన్నాల ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు ఐసెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన సెషన్‌కు 100 మందికి 100 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ గోపాల సుదర్శనం, టీసీఎస్ ఆఫీసర్ రాకేష్, పీఆర్వో బొడ్డు రఘు, షాదుల్లా, డీపీ రావు, కరీముద్దీన్, రాజేశ్వర్ పర్యవేక్షించారు.

**◆ నీట్‌లో రాణించిన బెజ్జంకి విద్యార్థి**



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారు పాపన్నపల్లెకు చెందిన దోనె శరత్‌చంద్ర నీట్‌లో 568 మార్కులు సాధించాడు.తల్లిదండ్రులు వసంత, ప్రభాకర్ వ్యవ సాయపనులు చేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. నీట్ 2024లో 720 మార్కులకు గాను 568 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 94.89 శాతం సాధించాడు. శరత్‌చంద్రను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.